# మమతలు మడతలు

రమాదేవి



మొదటి ఆట సినిమా వేళ కాలేదు. వెన్నెలలో డాబా మీద ఒంటరిగా నుంచుని వున్న నీరజను వెన్నెల చల్లదనం అంత రంగికంగా అనునయించింది. కన్న తల్లి ఊరడింపుకు కట్టలు తెంచుకుని ప్రవహించే కన్నీటి ప్రవాహంలా, నీరజ హృదయారాటం ఉబికి ఉబికి ఊహల రూపంలో తేలిపో సాగింది.

'ఆయ నెందుకిలా ఉంటా రబ్బా నేనంటేను.... నేనంటే ఇష్టం లేదా?.... ఇష్టం లేనప్పుడు ఎందుకు నన్ను చేసుకోవడం—చేసుకుని న న్నిలా బాధపెట్టడం దేనికో' అనుకుంది నీరజ. 'బాధ'....నిజానికి తనకేమీ కష్టంలేదు ఇంట్లో. అన్ని సౌకర్యాలూ ఉన్నాయి! ....అయినా నీరజకు బాధగానే ఉంది. అది ఎందుకో తనకే తెలుసు. బహుశా తన భర్తకికూడ తెలుసునేమో!...ఏమో అసలు తన ఆరాటాన్ని గుర్తించే స్థితిలో ఉన్నాడా. భర్త! ....ఇలా నీరజ ఊహలు తేలిపోసాగాయి.

రావు, నీరజను పెళ్లిచేసుకున్నాడు రెండు నెలల క్రితం. అయినా నీరజతో మనసిచ్చి మసలలేదు. నీరజకి వచ్చిన కొత్తలో మరీ ఏమీ అర్థమయేవాడు కాడు రావు. రాత్రి భోజనా లయాక గంటలతరబడి సిగరెట్లు తాగుతూ ఏదో లోకంలో ఉండే రావు నీరజకి ఎంతకీ అంతుబట్టేవాడు కాడు. నీరజ ఉండబట్టలేక వెళ్లి పలకరిస్తే ఉలిక్కి

పడి, ఎవరో కొత్తదాన్ని చూచినట్టుగ తెల్లబోయి చూచేవాడు. ఆ చూపు చూచి, నీరజ తానేదో నేరంచేసినట్టుగ బాధపడి, తలవంచుకుని, తన మంచం చేరి, దిండులో తల దూర్చుకొని పడుకునేది. ఎన్నిరోజు లిలా ?... 'ఒక వేళ తల్లి జబ్బునుగురించి బాధపడుతున్నాడేమో భర్త' అనుకుని సరిపెట్టుకో చూచింది నీరజ మొదట్లో. కాని ఎందుకో అది అతికినట్టుగా కనపడలేదు. కొడుకు పెళ్ళయిన నెలాపదిహేనురోజులకే తల్లి చనిపోయింది. తల్లి చావుకి, రావు అక్క 'సుహాసిని' వచ్చింది. తమ్ముడి పెళ్లికి వచ్చి తిరిగిపోయినదల్లా, సుహాసిని ఒక కంట తమ్ముడ్నీ మరదల్నీ కనిపెట్టి చూస్తూ ఉంది. ఉక్కబోస్తున్నట్టుగఉండి, చల్లగాలికోసం డాబా ఎక్కిన సుహాసినికి మోకాళ్ళమీద తల ఆన్చుకుని శోక దేవతలా కూర్చున్న నీరజ కనపడింది.

సుహాసినికి, రావు, తన క్లాస్‌మేట్ వనజని ఎంతగా ప్రేమించాడో తెలుసు. నీరజని చేసుకున్నా, ఇంకా వనజని మర్చిపోలేక, ఎంతగా తన తమ్ముడు అవస్థ పడుతున్నాడో కూడ అర్థంచేసుకుంది. 'ఈ సంగతి నీరజకు చెబితే కొంత పరిస్థితి చక్కబడవచ్చేమో ?...తీరా తెలిశాక, పరిస్థితులు మరీ విషమిస్తే? నీరజ, రావు వనజల ప్రేమసంగతి సహృదయంతో తీసుకోలేకపోయి....అలాఅని ఊరుకుంటే ఎవరి మనసులలోది వారిలోనే ఉండిపోయి, అనవసరంగా భార్యాభర్తల మధ్య అఖాతా లేర్పడి పోతాయేమో శాశ్వతంగా' అని పరిపరివిధాలుగా అనుకుంది సుహాసిని. నీరజ దగ్గరగా. వెళ్లి ప్రక్కనే కూర్చుని, తలమీద చేయివేసి నిమిరింది. నీరజ ఉలిక్కిపడి తల ఎత్తి చూచింది. చెక్కిళ్లపై తడి మడులు కట్టి ఉంది. కళ్లురెండూ వర్షిస్తున్న మేఘాలలా ఉన్నాయి. సుహాసినికి ఎక్కడలేని జాలీ పుట్టుకొచ్చింది. ప్రక్కనే కూర్చుని తన చేతులతో నీరజ చెంపలు తుడుస్తూ !

"నాతో చెప్పమ్మా....ఏం జరిగింది?" అని అడిగింది.

"నేను చేస్తున్న తప్పేమిటో చెప్పరు... ఆయనకూడ రోజురోజుకీ చిక్కిపోతున్నారు....పిచ్చివాలకం పడుతున్నారు" అని గొంతు పెగుల్చుకుని అని, నీరజ, ఆవిడ చూపుతున్న ఆప్యాయతకు తట్టుకోలేకపోతున్నట్టుగా, ఆవిడ ఒళ్ళో తల పెట్టుకుని తనివితీరా ఏడ్చింది.

సుహాసిని నీరజ తల నిమురుతూ, "నీరజా ! నీకు కష్టాలు కొత్త కావమ్మా ! తల్లి లేకపోయినా, ఆ లోటును కనపడనీయకుండా తమ్ముళ్ళను, చెల్లెళ్ళను చూసుకున్నావ్....ఇక్కడా నీకు పెద్ద దిక్కు కరువయింది....రావు మనసు చాలా మెత్తన. ఎవర్నీ కష్టపెట్టవద్దనుకుంటాడు....మమతల్ని త్వరగా తెంచుకోలేడు....వాడిని ఎవరన్నా తప్పుగా అర్థం చేసుకుంటున్నా, అలా నిస్పృహతో ఊరకుండిపోతాడే కాని, వాళ్ళకి అర్థమయేటట్టుగ మనసువిప్పి చెప్పలేడు. మనమే తనని సానుభూతితో చూసి అర్థం చేసుకోవాలి. అండగా నిలవాలి....లేక



పోతే అంతే....అలాగే అయిపోతాడు'' అంది.

నీరజ సుహాసిని వడిలోనుంచి తల ఎత్తి. ఆవిడ ముఖంలోకి చూసింది, దిగులుగా. "నీరజా! నువ్వు చిన్నదానివయినా, పరిస్థితులను సరిగా అర్థం చేసుకోగలవన్న నమ్మకం నాకుంది....తమ్ముడు 'వనజ' అంటే చాలా ఇష్టపడేవాడు. పెళ్ళి చేసుకుందామనుకునేవారు ఇద్దరూ. వనజ కూడ మా వీధిలోనే ఉండేది. ఇద్దరూ ఒకే కాలేజిలో చదివారు. అయిదారు నెలల క్రితం వనజ తండ్రికి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లిపోయారు'' పరిస్థితులు కలిసి రాలేదు....ఇద్దరూ విడిపోయారు....వనజను పూర్తిగా మర్చిపోలేక బాధపడుతున్నాడు రావు....నీరజా, నువ్వు వేరేగా అర్థంచేసుకోకుండా, రావుని జాగ్రత్తగా చూసుకుంటావు కదూ!...నీ ఆదరణలో త్వరలోనే తన పాత సంగతులన్నీ మర్చిపోతాడు. నువ్వు నిస్పృహ చెందకు. నా కెప్పటికప్పుడు సంగతులన్నీ మనసువిప్పి రాస్తూఉండు" అంది సుహాసిని నీరజ బుజంమీద చెయివేసి.

నీరజ అప్పుడే తనకు తెలిసిన ఆ నూత్న సంగతిని ఆకళింపు చేసుకోవడానికి ప్రయత్నిస్తూ, సుహాసినివంక అయోమయంగా చూసింది. సుహాసిని ఇక ఏమీ మాట్లాడలేదు. అలా నీరజ బుజం నిమురుతూ కూర్చుండిపోయింది.

కాసేపటికి గేటు చప్పుడయితే 'రావు వచ్చాడనుకుని' ఇద్దరూ డాబా దిగి కిందికి వెళ్ళారు.


మరుచటిరోజు సుహాసిని తన ఊరు వెళ్ళిపోయింది. ఇల్లు మరీ బోసిపోయింది. నీరజ, రావు ఇద్దరే ఇంటికంతకీ....మూడవమనిషి లేకుండా, ఇద్దరి మధ్యా మౌనం మరీ దుర్భరంగా ఉంది. రావు ఆఫీసుకి వెళ్ళిపోయాడు. నీరజకేమీ తోచలేదు. బట్టల బీరువా తెరిచింది. చిందరవందరగా పడిఉన్న బట్టలు సర్దుదామని. రెండు అరలు సర్దింది! ఆప్యాయంగా వాటిని తన రెండు చేతులతో స్పృశిస్తూ. నీరజకు నవ్వువచ్చింది తను చేస్తున్న పనికి. భర్తమీద తనకెంత ఆదరణ, ప్రేమ ఉన్నాయో అప్పుడే గమనంలోకి వచ్చింది. భర్తకట్టుకునే బట్టల మీద కూడా తనకెంత ఆప్యాయతగా ఉంది! ఆ గదిఅంతా, ఒక్కసారి తలతిప్పి చూసింది. భర్త కూర్చుని వ్రాసుకునే కుర్చీ, బల్లా, బట్టలస్టాండు, గోడనున్న భర్త ఫోటో, భర్త పడుకునే మంచం, బట్టల బీరువా....అవన్నీ తనకు చాలా దగ్గరగా అనిపిస్తున్నాయి. "ఎవరిమీదనన్నా ప్రేమ ఉంటే, వారికి సంబంధించిన ప్రతి చిన్న వస్తువుమీదకూడ అంత ప్రేమ పుడుతుంది కాబోలు'' అనుకుంది నీరజ. కొంచంగా తనకు తెలియకుండానే తనలో ఊరట కలుగుతున్నట్లుగా తోచిందినీరజకి. "ఆ గదిని, ఆ మనిషిని తను సర్దకపోతే ఎవరు సర్దుతారు'' అనుకుంది. మూడవ అరలోని బట్టలన్నీ బయటకు తీసింది. అడుగునఉన్న పాత పేపరుకాగితం ఇవతలకిలాగింది, కొత్త కాగితం వేద్దామని. ఆ పేపరుతోపాటు పెద్ద కవరు కింద పడింది దానిని తీసి చూసింది. కవరు చించిపెట్టే ఉంది....ఆ కవరులో ఏమున్నాయో చూడాలనిపించింది....కాసేపు తటపటాయించింది చూడడానికి. "అందులో ఏముంటేమాత్రమేం....ఏమున్నా తనదగ్గర రహస్యమేముంటుంది భర్తకి...ఆడబిడ్డ అన్నిసంగతులూ తనకి ముందే చెప్పింది కదా'' అనుకుని ఆ కవర్లోనుంచి కాగితాలు తీసి చూసింది. ఆ కాగితాలమధ్యనుంచి ఒక ఫోటో కింద పడింది. అది వనజదని గుర్తించడానికి ఆట్టేసేపు పట్టలేదు నీరజకి. కాసేపు ఆ ఫోటోని అలాగే పరీక్షిస్తూ కూర్చుంది. కొంచెం బొద్దుగా, గుండ్రంగా ఉంది ముఖం. కళ్ళల్లో చిలిపితనం ఎక్కువగా ఉంది. బాగా వంకుల జుట్టు. 'బహుశా ఎఱ్ఱగా ఉండి ఉంటుంది అనుకుంది నీరజ. గోడమీద తగిలించిఉన్న భర్త ఫోటో వంక చూసింది. కొద్దిగా కోలగా ముఖం, నిడుపాటి ముక్కు, పెద్ద నుదురు, దువ్వుకున్నా దువ్వుకోనట్టుగా కనపడే రింగులు రింగులుగా చుట్టుకున్న జుట్టు, జాలిగా చూసే కళ్లు. ఇద్దరికీ ఏ కొంచెమూ పోలిక లేదు, అనుకుంది నీరజ.

ఆ కాగితాలన్నీ వనజ వ్రాసిన ఉత్తరాలు. మొదటిదానిమీద అయిదు నెలల క్రితం తారీఖు వేసిఉంది. అది తీసి చదవడం మొదలుపెట్టింది.

డియర్,

హఠాత్తుగా మా నాన్నగార్కి ట్రాన్స్‌ఫర్ అవడం, మీ అమ్మగార్కి జబ్బు ఎక్కువవడం....ఏమిటో చాలా భయంగా ఉంది నాకు....నీ కెలాఉందో గానీ....నీకేమిటిలే....నేను కాకపోతే మరొకరు వస్తారు!....కోపం వచ్చిందా దొరగార్కి?....పోనీ అననులే అలా.

ఇంట్లో నా పెళ్లివిషయంలో చాలా గొడవలు జరుగుతున్నాయి. అమ్మ, నాన్న ఒక్కటయ్యారు. నాసైడు నేనొక్కతినే అయ్యాను. అమ్మ నిన్న నా పెళ్ళిసంగతి ఎత్తింది. "రిజల్ట్సు తెలిశాక చేసుకుంటా"నన్నాను. "రిజల్ట్సు ఏమయినా, ఇక ఇక్కడితో చదువు అయినట్టే కదా! మళ్లీ కాలేజికి వెళ్లేపని లేదుకదా! మళ్ళీ ముహూర్తాలు కుదరకపోవచ్చు తరవాత" అంది అమ్మ. నాన్నగారుకూడ దానికి వంతపాడారు. ఇంతకీ వాళ్లు ఎన్నిక చేసినవరుడెవరో తెలుసా?....ఒకసారి మీకు పరిచయంచేశాను, "ఈయన మా ఫయిల్వాన్ మావయ్య" అని....అతనే. మా అమ్మకి పెదనాన్నకొడుకవుతాడు. అయిదారు నెలల్లో ఆయనగారు 'బిజినెస్' మీద స్విట్జర్‌లాండ్ వగైరాలు తిరిగి వస్తాడట. అందుచేత ఆయనగారు వెళ్ళేముందు, నా మెళ్ళో మూడుముళ్ళూ వేసి, తనతోపాటు నన్నుకూడ తీసుకుపోతా




"వీళ్ళందరూ నా వల్ల గొప్పవాళ్ళయినవారే. ఆ గడ్డాలాళ్ళున్నారు చూశావా ? వాళ్ళు నన్ను ప్రేమించి మర్చిపోయేందుకు మహర్షులయ్యారు. ఇహ వీళ్ళు నన్ను ప్రేమించి మర్చిపోలేక కవులయ్యారు."

డట.... ఇదీ సంగతి.... మా అమ్మతో నిజం చెప్పేశాను. నిన్నుతప్ప మరెవర్నీ చేసుకో దలచుకోలే దన్నాను.

అది విని అమ్మ కాస్త ముందు తెల్లబోయింది. మళ్లీ వెంటనే తేరుకుని, "నేను అప్పుడే అన్నాను 'వయసొచ్చిన పిల్లలు స్నేహాలంటూ అంత కలిసి తిరగకూడదూ' అని. మీ నాన్నగారు వింటేనా?........ 'ఈ కాలంలో ఇలాగే ఉంటారులే. నువ్వేరికే గాభరాపడకు' అన్నారు. ఏ కాలమయితే నేమిటి ఇలాంటి విషయాలకి" అంది అమ్మ.... అమ్మ అన్నమాట నిజమేనేమోకదూ.... సరే. రాత్రి అమ్మ ఈ సంగతికాస్తా నాన్న చెవిలో ఊదేసింది. ఇవాళ ఆఫీసుకు వెళ్లేముందు నాన్నగారు నన్ను పిలిచి చిన్న ఉపదేశంలాంటిది చేశారు.... డియర్ ! నాన్నగారు అన్న మాటలు అన్నట్టుగా వ్రాస్తే మీరు మనసు కష్టపెట్టుకోరు కదూ !.... మొట్ట మొదటి అభ్యంతరం మనకులాలు వేరట. రెండవ అభ్యంతరం ఎంతైనా మా అంతస్తుకు, మీ అంతస్తు తక్కువట. మూడవదేమిటంటే, 'పోనీ ఒకపిల్ల ఎవరో నచ్చినవాడ్ని చేసుకున్నా, మిగతా పిల్లల కన్నా మంచిచెడ్డలు చూసి, ముచ్చటగా పెళ్ళిళ్ళు చేయవచ్చు ననుకుంటే, మరీ నేనొక్కతినే కూతురినయిపోయానట.... ఇవీ నాన్నగారు పెట్టిన అభ్యంతరాలు.

నేనూ ఊరుకోలేదు. నాన్నగారిదగ్గర మొదటినుంచీ నాకు చనువెక్కువకనుక, "మరి మేం మొదటినుంచీ స్నేహంగా ఉంటే మీ రభ్యంతరంపెట్ట లేదేం" అని అడిగాను. దానికి, "స్నేహానికి, పెండ్లికి చాలా తేడాఉంది.... కులాలు, స్టేటస్‌లు పెండ్లికి అడ్డుపడ్డంతగా స్నేహానికి అడ్డు పడవు" అన్నారు.

ఏది ఏమయినా ప్రేమని మాటల్లో చెప్పి, వాదించడం ఎంత కష్టమైన సంగతో మొదటిసారిగ అనుభవంలోకి వచ్చింది నాకు ఈవేళ. అయినా నా ప్రయత్నం నేను మానను. నాన్నగార్ని ఎలాగైనా ఒప్పిస్తాను.

అన్నట్టు మా మామయ్యగారు ఒక వారంరోజుల్లో దిగుతున్నారట. ఇప్పుడే ఉత్తరం వచ్చింది.

ఉత్తరం మరీ ఊకదంపుడుగా ఉందేమోకదూ! ఏంచేయను చెప్పండి....నాకేమీ మంచిమాటలు రావడంలేదు ఈ పూట. ప్రేమనిగురించిన వాదనలు ఇంట్లో మొదలయిన దగ్గరనుంచీ మరీ విసుగుగా ఉంది. మంచి మంచి ఊహాలు, ఆలోచనలకు బదులు, "వీళ్లని ఎలా ఒప్పించాలా" అన్న వాటిమీదనే ఆలోచనలు మళ్లుతున్నాయి. మనసు చికాకుగా ఉంది ... ఏమీ అనుకోరుకదూ !.... ఈ సారి మంచి ఉత్తరం వ్రాస్తాను.... అందాక .... ఇంక ఏం వ్రాయనూ, ఇక్కడ .... ఉంటానుమరి.

మీ వనజ."

అని ఉంది. అది పక్కనపెట్టి, మరో ఉత్తరం తీసింది నీరజ. దానిమీద మరో ఇరవై రోజులు పోయినతర్వాతి తారీఖుఉంది.

"డియర్,

అనుకున్నట్టుగానే మా మావయ్య దిగాడు. మా అమ్మ అమాయకమైంది అనుకున్నానుకాని, అవసరం వస్తే చాలా తెలివితేటలు మొలుచుకొస్తాయి మా అమ్మ తలలోనుంచి. తనే పెద్ద మెహర్బానీగా పిక్‌నిక్‌లూ అవీ, సినిమా ప్రోగ్రాములు ఏర్పాటు చేసేస్తోంది జోరుగా. రోజుకోరకం పిండివంటచేసి మేపుతోంది. మా మావయ్యను.... ప్రతి క్షణం ఏదో వంకతో మా మావయ్యో, అమ్మో నన్ను వెన్నంటి ఉంటున్నారు. మీకు తీరికగా, తెరిపిగా కూర్చుని ఉత్తరం వ్రాద్దామనుకుంటే పడనిచ్చారుకాదు ఇన్ని రోజులూ. నిన్ననే మావయ్య ఒక నెక్లెస్ కొనుక్కొచ్చి, భోజనాలదగ్గర మా ముగ్గురికీ చూపించాడు. సిగ్గులేకుండా, "ఇది వనజకు మొట్ట మొదటగా ఇచ్చే నా ప్రేమ కానుక" అన్నాడు. మా అమ్మ తెగ మురుసుకుంది. మా నాన్నగారు తల వంచుకుని నవ్వుకున్నారు. నాకు ఒళ్ళు మండిపోయింది. కాని ఏం చేయను ? అన్నంముందునుంచి లేచి వెళితే అసభ్యంగా ఉంటుం దని కూర్చుండిపోయాను.... మీకు ఈర్ష్యగా ఉందా ఇలా వ్రాస్తుంటేను ?.... మరేం చేయను. జరిగిన విషయాలన్నీ, దాచకుండా మీకు వ్రాసేయాలని ఉంటుంది

నాకు.' ఒకటిమాత్రం చెప్పుకోవాలి. మా మావయ్యలో ఒకటుంది. వెకిలి వేషాలు మాత్రం వేయడు. అందుచేత నేను ఎదురు తిరిగి గట్టిగా మా మావయ్యను నాలుగు ఛడామడా అనడానికి వీలులేకుండా ఉంది. సినిమాలకి, పిక్‌నిక్‌లకు రాననడానికి వీలు లేకుండా ఉంది. అమ్మ, నాన్న, మావయ్య ముగ్గురూ కలిసి ఒడుపుగా నన్ను వలలో వేసుకుందామని ప్రయత్నిస్తున్నారు. నేను వాళ్లకంటే నాలుగాకు లెక్కువే చదివానని వాళ్లకు తెలియదు.

నాన్నగారు ఒక నెలరోజులు సెలవు తీసుకుంటున్నారు. అందరంకలిసి ఊటీ వెళ్ళాలని ఆలోచిస్తున్నారు. నాకు వెళ్లాలనిలేదు. 'ఎలా తప్పించుకోవాలా' అని ఆలోచిస్తున్నాను....

మీ అమ్మగారికి జబ్బు అలాగే ఉందని వ్రాశారు. ఇంతకీ మీ అమ్మగార్కి మన పెళ్ళి విషయంలో ఎలాంటి అభిప్రాయం ఉందో, అసలు ఆ విషయం కదిపిందీ, లేనిదీ వ్రాయనేలేదు.... ఈసారి ఉత్తరంలో ఆ సంగతి వ్రాయండి. అన్నట్టు నిన్న మీ ఉత్తరం వచ్చినప్పుడు, ఆ పని మనిషి అదికాస్తా అమ్మచేతికిచ్చాడు, నేను అక్కడ లేకపోయేటప్పటికి. ఇంకా నయం ఇచ్చింది అమ్మ నా చేతికది.... మన ప్రేమవిషయం తెలిశాక అమ్మనాకు వచ్చే ఉత్తరాల విషయం పట్టించుకుంటోంది. ఏదో అనుమానం వేసినట్టుంది. "ఎక్కడనుంచి ఉత్తరం" అంది. ఏ విషయం నన్నిలా అడగదు అమ్మ. "స్నేహితులదగ్గరనుంచి" అన్నాను. "నిజమేనా" అంది మళ్ళీ అనుమానంగా.

ఇప్పుడిదొక గొడవయిపోయింది. ప్రతి పోస్టుకు, పోస్టుమాన్ వచ్చే వేళకు, మీ ఉత్తరం అమ్మచేతుల్లో పడకుండ, ఎదురుచూస్తూ కూర్చోవలసివచ్చేటట్టుంది. మీరు వ్రాసే ఉత్తరంలో తరువాతి ఉత్తరం ఏ తారీఖున వ్రాస్తారో, వివరంగా వ్రాస్తే నాకు కొంత వీలుగా ఉంటుంది. అలా చేస్తారుకదూ !.... విసుగుగా ఉందా మీకు ? .... ఏమిటో షరతులని ? .... ఏం చేయను చెప్పండి.... మీ ఉత్తరం మీ కబుర్లులాగానే ఎంత అందంగా ఉందో ! అడుగో మా మావయ్యొస్తున్నాడు. ఇక ముగించేస్తున్నాను.

మీ

వనజ.

అని ఉంది. తరువాతిది తీసింది నీరజ. అయిదురోజుల తర్వాతి తారీఖే వేసి వుంది దానిమీద.

"మరీ,

మీ ఉత్తరం తిరుగుటపాలో వచ్చేసింది. ఎంత భయం మీకు !... నేను వాళ్ల వలలో చిక్కుకుపోతానేమోనని భయంగా ఉందని వ్రాశారు. నాకు నిజంగా కోపం వస్తోంది మీ మీద. నన్నంత మీరు తక్కువ అంచనా వేస్తారనుకోలేదు నేను.

మీ అమ్మగార్కికూడ మన ప్రేమ విషయం అంతగా నచ్చలేదని వ్రాశారు. మీ అక్కగారు మాత్రం, "నీ ఇష్టం.... నీకు మంచిదని తోచిందేదో చేయి" అన్నారని వ్రాశారు. మీ అక్కగారికి, నా ధన్యవాదాలందజేయండి. మీ అమ్మగారు ముందు అభ్యంతరపెట్టినా, "ఏదో ఒకటి. త్వరలో పెళ్ళి చేసేసుకోవడం నాకు కావలసింది. పోనీ నీకు నచ్చినమ్మాయినే, నేను చచ్చిపోయేలోగానైనా చేసేసుకో. నీ పెళ్ళి నా కళ్ళారా చూడనీయ్" అని కంట తడిపెట్టుకున్నారావిడ అని వ్రాశారు. నిజంగా మీవాళ్లు చాలా మంచివాళ్లు .... ఎంత త్వరగా ఒప్పేసుకున్నారు! నేను మొదట మా వాళ్లుకూడా అలా ఒప్పేసుకుంటారనుకున్నాను. కానిపైకి ఎంత మెత్తగా కనపడ్డప్పటికీ, మావాళ్లు గట్టివాళ్లులాగానే ఉన్నారు. మా నాన్నగారు నా ఇష్టానికి వ్యతిరేకరించరు అనుకున్నాను. కాని ఆయనా తమాషాగా, తెలియనీయకుండానే ఆయన ఇష్టాలని నాయిష్టాలుగా చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఊటీ ప్రయాణం తప్పడంలేదు నాకు. ఇవాళ సాయంత్రమే వెళుతున్నాం. అక్కడికి వెళ్లాక వివరంగా ఉత్తరం వ్రాస్తాను. ఇంట్లో అంతా హడావిడిగా ఉంది. నా మనసులో అంతా గడబిడగా ఉంది... నే నే మనుకుంటున్నానో అనైనా మా వాళ్లు ఆలోచిస్తున్నట్టులేరు. ఏమీ జరగనట్టుగానే మామూలుగా ప్రవర్తిస్తున్నారు. వాళ్లనలా చూస్తుంటే నాకు ఒళ్లు మండిపోతోంది. మీ మీద కూడ కోపంవస్తోంది. నేనిక్కడ ఇంత మా వాళ్లమధ్య చిక్కుకుపోతే, మీ రక్కడ తెరిపిగా హాయిగా ఉన్నారు... ఎవరైనా అంతే.... ఎవరికీ నా సంగతి పట్టదు,


వనజ."

అని ఉంది..."కాస్త కోపంతో ముగించింది ఉత్తరం" అనుకుంది నీరజ. అంత వరకు చదివిన ఉత్తరాలనుబట్టి, వనజ రావులమధ్య ప్రేమని అంచనావేసి, వారిద్దరి మనస్తత్వాలని అర్థంచేసుకోవడానికి ప్రయత్నించింది నీరజ. వనజలో గొప్ప ఇంటి గారాబుబిడ్డ కొట్టొచ్చినట్లుగా కనపడుతోంది. మనసు మంచిదే అయినా అంత లోతైనదిగా, కష్టాలకు తట్టుకోగలిగేదిగా అనిపించలేదు. ఎంతైనా రావుకి వనజమీద ఉన్నంత ప్రేమ, ఏకాగ్రత, వనజకు రావుమీద లేవేమో ననిపించింది. ఉన్నా అవి ఎక్కువకాలం నిలవవేమో అనిపించింది. ఉత్తరం ముగింపు మళ్ళీ చదివింది నీరజ. "తను నవ్వితే ఇతరులు నవ్వాలి. తను బాధపడితే ఇతరులు బాధపడాలి. తనకు తగ్గట్టుగ మిగతావారు మసులుకోవాలి వనజకి" అనుకుంది నీరజ. నాల్గవ వుత్తరం వేసింది. 'అది ఊటీకి వెళ్లిన తర్వాత వారంరోజులకి, అక్కడినుంచి వ్రాసినట్టుగా, తారీఖు వేసివుంది దానిమీద.

"ఏమండీ!

ఏం చేస్తున్నారు ?....మీ కేం........ హాయిగా స్వేచ్ఛగా ఉంటారు. కనీసం నాకు స్వేచ్ఛగా ఉత్తర మైనా వ్రాయ గలరు. నాకు ఆ వీలుకూడ లేకుండా పోతోంది....బంగారు పంజరంలోని పిట్ట బ్రతుకులా ఉంది నాపని ఇక్కడ. ప్రకృతి సౌందర్యాన్ని, నా సౌందర్యాన్ని తెగ పొగడుతున్నాడు మా మావయ్య.... ఎక్కడా తప్పుపట్టానికి వీలు లేనంత అందంగా, తెలివిగా మసలుకుంటున్నాడు మళ్ళీ...మావయ్యమీద కోపం తెచ్చుకుని దూరంగా పొమ్మనడానికిగాని, అమ్మ నాన్నలతో ఫిర్యాదు చేయడానికి గాని అసలు అవకాశం కల్పించడం లేదు. అమ్మో! మనుష్యు లెంత తెలివైనవా ళ్ళనీ!....మీరుమాత్రం తక్కువ తిన్నారా ఏమిటి ? మీరూ తెలివిగానే నన్ను వలలో వేసుకున్నారు. చదువుకున్నానన్నమాటే గాని, ఇలాంటి విషయాల్లో తెలివితేటలు శూన్యం నాకు....అందరూ నన్ను మోసం చేయడానికి ప్రయత్నించేవాళ్ళే.

ఇవాళ అమ్మ, నాన్న, మావయ్య, నేను కూర్చుని టీ తాగుతున్నాం. అమ్మ చల్లగా నా పెళ్ళి సంగతి ఎత్తింది....అలా అలా మాటల్లో మా మావయ్య, "నేను తనకు తగనేమోలే....ఆట్టే బలవంతపెట్టడం మంచిది కాదు" అన్నాడు ఏదో బాధగా మేఘాలలోకి చూస్తూ. "తనకి తోచదు....ఇతరులు చెబితే వినదు, ఇప్పుడు నీకేం తక్కువయిందని. అందం తక్కువనా, చదువు తక్కువనా, హోదా తక్కువనా'' అంటూ తాగేశాగే టీ వదిలేసి లోపలికి వెళ్ళిపోయింది అమ్మ. నాన్నగారుకూడ లేచి, అమ్మను సముదాయించడానికి కాబోలు లోపలికి వెళ్ళిపోయారు. నా కేం చేయాలో తోచలేదు. అలాగే కూర్చుండిపోయాను, తల వంచుకుని. తర్వాత హఠాత్తుగా తలెత్తి చూసే సరికి, మా మావయ్య నావంకే పరీక్షగా



"ఊరికే మిడిసి పడకండి, రేపు సోషలిజంవస్తే నేను మీలాగే ఆ సీటులో కూర్చుంటాను."

చూస్తున్నాడు. ఎప్పుడూ నవ్వుతూఉండే మా మావయ్య ముఖం, ఆ క్షణం అచ్చంగా మీ ముఖంలాగే....ఆ రోజున మీరు, నన్ను ప్రేమిస్తున్నా నని చెప్పిన రోజున ఎలా కనపడిందో, అలా కనపడింది. ఏం చేయలేక నాకు ఏడుపు వచ్చింది. మావయ్య నన్ను ప్రేమిస్తున్నాడు కాబోలు మరి...ఏమో !.... నేను లేచి గబగబా లోపలికి వచ్చేసి తలుపులు వేసుకుని పడుకుని చాలా సేపు ఏడ్చాను. మీ రనుకుంటారు, నే నిక్కడ హాయిగా సుఖంగా ఉన్నానని....నిన్నటి నుంచి మావయ్య నాతో ఎక్కువగా మాట్లాడడంలేదు. అంత హుషారుగానూ ఉండడంలేదు. దానికి కారణం నేనే నన్నట్టుగ మా అమ్మ నన్ను నిష్ఠూరంగా చూస్తోంది. అందరికీ నామీదే కోపం....! మళ్ళీ త్వరలోనే ఉత్తరం వ్రాస్తాను మీకు. అప్పుడు నా ఎడ్రసు కూడా వ్రాస్తాను. నన్ను గుర్తుంచుకుంటారు కదూ!

మీ
వనజ. "

అని ఉంది...."మొగ్గ మావయ్యవైపు చూడవచ్చు భవిష్యత్తులో'' అనుకుంది నీరజ....“ఆ ఉత్తరం చదువుకుని, ఆయన ఎంత బాధపడి ఉంటారో, ఎంత ఆశా భంగాన్ని పొంది ఉంటారో'' అనుకుంది నీరజ. "ఆఉత్తరాన్ని చదివి తనప్రియుడు పొందే బాధని బహుశా అర్థం చేసుకునే టంత తెలివి వనజకు లేదని'' నిర్ధారణ చేసుకుంది నీరజ. "ఒకవేళ అర్థం చేసుకో గలిగిన శక్తే ఉంటే, 'బాధపడితే బాధ పడనీయ్' అని నిర్లక్ష్యంతోనైనా వ్రాసి ఉండాలి...ఒకవేళ ఇది పొరపాటే నేమో....తనకు జరిగిన ప్రతి విషయమూ ఎలాంటిదైనా ప్రియుడిదగ్గర దాచలే దేమో వనజ" అనుకుంది మళ్లా నీరజ... అయిదవ ఉత్తరం తీసింది.

దానిలో నెలా పదిహేను రోజుల తర్వాతి తారీఖు వేసిఉంది.

"ఇన్నిరోజులుగా ఉత్తరం వ్రాయలేదని మీకు కోపం వస్తుందని నాకు తెలుసు. అసలు సంగతి తెలిస్తే మీరు బహుశా కోపపడకపోవచ్చు. మీకు క్రితంసారి ఉత్తరం వ్రాసిన రెండురోజులకే నాకు టైఫాయిడ్ వచ్చింది. అమ్మ, నాన్న చాల గాభరాపడ్డారు. టైఫాయిడ్ మరీ ఉధృతంగా వచ్చింది. నెలరోజులు మంచంమీది

కాలు క్రింద పెట్టలేకపోయాను. ఎప్పుడూ మగతగానే ఉండేది. ఆ మగతలో, కలలో మీరే కనపడుతూ ఉండేవారు. కన్ను విప్పి చూస్తే మావయ్యా కళ్ళల్లో ఒత్తులు పెట్టుకుని, మంచం ప్రక్కనే స్టూలుమీద నా కెప్పుడు ఏం కావలసి వస్తుందో నని కనిపెట్టుకుని కనపడేవాడు. 'ఎందుకు మావయ్యకు నామీద ఇంత పిచ్చిప్రేమ' అని జాలివేసేది. నేనేంచేయను ?.... నేను తనని ప్రేమించమని చెప్పలేదుగా !.... అందులో నా తప్పేముంది ? నాకు పథ్యం పెట్టి, నేను కొంచెంగా కోలుకోవడం మొదలుపెట్టేసరికి మావయ్యా పడక వేశాడు. డాక్టర్లు, "మనసుకు, శరీరానికి తగిన విశ్రాంతి లేకుండ శ్రమ పడడంవల్ల వచ్చిన జ్వరం అది ..విశ్రాంతి లభిస్తే తగ్గిపోతుంది" అని చెప్పారు.

అమ్మ దానికి కారణం నేనే నంటుంది. నాకోసం అంతగా కష్టపడి, తనకి జబ్బు తెచ్చుకున్న మావయ్యని చూస్తే నాకు చాలా జాలివేస్తోంది...తనకి కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియడంలేదు...ఒంట్లో ఇంకా చాలా నీరసంగా వుంది. ఇక ఇక్కడికి ముగిస్తాను. మీ అమ్మగారి ఒంట్లో ఎలా వుంది ?.... మీ అమ్మగారి సేవలో, మీరు మరీ చిక్కిపోలేదు కదా! ఎందుకంటే జబ్బుతో వున్నవాళ్ళకి సేవ చేసేవాళ్లు, ఏ స్థితిలోకి వస్తారో నేను కళ్ళారా చూస్తున్నాను కదూ ! అందుకని అలా అడుగుతున్నాను...ఉండనా మరి...మిమ్మల్ని చూడాలనివుంది.

వనజ."

(ఎడ్రసు వెనకవైపు వ్రాశాను.)

అనివుంది. నీరజ ఆరవ వుత్తరం తీసింది. దానిమీద, వారంరోజుల తర్వాతి తేదీ వేసివుంది.

"ఉత్తి ఖంగారూ,

ఎంత ఖంగారు పడిపోయారు నా జబ్బునుగురించి. ఇప్పుడు నేను పూర్తిగా కోలుకుంటున్నాను. మీరు శ్రమపడి రావద్దు. అందులో ఈ పరిస్థితుల్లో మీరు రావడం అసలు మంచిదికాదు. మావయ్యకుకూడ జ్వరం తగ్గింది. ఇకఅందరం తిరిగి ఊరు వెళ్ళిపోదామనుకుంటున్నాం. నాన్నగార్కి కూడ ఇంకా . ఎక్కువ సెలవు దొరికేటట్టులేదు. 'టైఫాయిడ్' వచ్చినంతమాత్రంలో, నేనేదో చచ్చిపోయానన్నంత బాధపడిపోయారే మీరు.. నిజంగా అంతప్రేమా మీకు నామీద !.... మీరందరూ అంత ప్రేమగా చూస్తారు నన్ను .... నేను నిజంగా అందుకు తగినదాన్నేనా అనిపిస్తోంది ఇప్పుడు నాకు. మీ అమ్మగారి జబ్బు రోజురోజుకీ ఎక్కువవుతోందనీ. మీ కంటె సేవ, మీ అక్కగారే చేస్తున్నారని వ్రాశారు....అయితే మీ అక్కగారు ఇంకా అక్కడే ఉన్నారన్నమాట...బలేమంచావిడ కదూ ! మీ అమ్మగారు పెళ్ళి త్వరగా అయిపోవాలని తొందరపడుతున్నారని, అసలా బెంగతోనే జబ్బు మరింత ఎక్కువవుతోందని వ్రాశారు....

నేనేంచేయను చెప్పండి.... నేను తొందరపడి పెళ్ళి త్వరగా జరిపేయమని అడిగితే, మా అమ్మా నాన్నా బడాయి కోరు మావయ్యని చేసుకోమంటారు. అందుచేత నేను ఎలాగైనా మా మావయ్య స్విడ్జర్లాండ్ వెళ్లిపోయే వరకు పెళ్ళిమాట తలపెట్టను. ఎంతకాలమయినా, అమ్మ, నాన్న, మనిద్దరం పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకునేవరకు వేచి ఉండాలి. ఇప్పట్లో నేను తొందరపడడం మనిద్దరికి నష్టం. అందుచేత మీరే మీ అమ్మగారిని ఎలాగైనా ఒప్పించాలి. ఈ విషయంలో మీరు నాతో ఏకీభవించకపోతే పరిస్థితులు మరీ విషమిస్తాయి.

మావయ్యతో నేను అసలు మనప్రేమ విషయం మాట్లాడదామనుకుంటున్నాను. కాని ఎలా మాట్లాడాలో తెలియడంలేదు. మావయ్యా మరీ నీరసంగా ఉన్నాడు. ఇప్పుడే ఈ సంగతులు చెబితే బాగుండదేమో! నెమ్మదిమీద చెబుతాను. మేం ఊరు వెళ్లిపోయాక, మళ్లీమీకు ఉత్తరం వ్రాస్తాను. మీరు వేరేవిధంగా అర్థంచేసుకోరుకదూ నన్ను ....

ప్రేమతో,

మీ

వనజ"

అని ఉంది. "పాపం తికమకలో పడింది" అనుకుంది నీరజ. ఏడవ ఉత్తరం తీసింది. దానిమీద ఇరవై రోజులతర్వాత తారీఖు వేసిఉంది.

"మీకు రోజురోజూ ఉత్తరం వ్రాద్దామనుకోవడం, తీరా కుదరక పోవడం వల్ల ఇన్నిరోజులూ అలాగే గడిచిపోయాయి. మేం పదిహేను రోజుల క్రితమే ఊటీనుంచి తిరిగి వచ్చేశాం. మావయ్యకి ఇంకా జ్వరం తగ్గలేదు. "అన్నిరోజులూ నాదగ్గర అలాఉండి సపర్యలు చేయడంవల్ల, నాజబ్బు అంటుకుని తనకు కూడ వచ్చిందని" అమ్మ అంటుంది .... ఏది ఏమైనా మావయ్యకు మాయింటికి వచ్చాక నాకు టైఫాయిడ్ రావడం, తర్వాత మళ్లీ తన కదేజబ్బు రావడం ఏమీ బాగాలేదు. నిన్న మందు ఇవ్వడానికని గదిలోకి వెళితే, మావయ్య, "నీకిష్టం లేకపోతే నన్ను చేసుకోమని బలవంతం చేయను" అని కలవరిస్తున్నాడు. నా వెనకనే గదిలోకి వచ్చిన అమ్మ ఆ మాటలు విని కళ్లనీళ్లు పెట్టుకుని, అక్కడినుంచి వెళ్లిపోయింది. నేనేం చేయను చెప్పు! నేనెవర్నీ తప్పు పట్టలేని స్థితిలో ఉన్నాను. అటుచూస్తే మీ ఇంట్లో మీ పెండ్లికి తొందర పడుతున్నారు. ఇటు చూస్తే మా యింట్లో పరిస్థితు లిలా ఉన్నాయి....ప్రేమపెళ్లీ ఇవన్నీ వదిలేసి ఎక్కడికైనా పారిపోవాలని ఉంది నాకు."

అని ఉంది. క్రింద సంతకం ఏమీ లేదు. ఏదోకోపంలో, ఎటూతెలియని స్థితిలో ముగించకుండా అలా వదిలేసి నట్టుగా

ఉంది ఉత్తరం. ఎనిమిదవ ఉత్తరం తీసింది నీరజ. దానిమీద పదమూడురోజులు తరువాతి తేదీవేసి ఉంది.

"మావయ్యకి పూర్తిగా జ్వరంతగ్గింది. మావయ్యతో మన ప్రేమసంగతి చెబుదామని వెళ్ళాను తను ఉండే గది దగ్గరకు. లోపలినుంచి మావయ్య మాటలు వినిపించాయి. "పోనీయ్ అక్కా! తనకంత ఇష్టం లేనప్పుడు మీరు మాత్రం అంత బలవంతం చేయడ మెందుకు!....ఇంకా చిన్నది...తన మీద నాకెంత ప్రేమ ఉందో తనకివాళ తెలియక పోయినా, కొన్నాళ్ళు పోయాకనైనా తెలుసుకోగలుగుతుంది" అన్నాడు మావయ్య. "అప్పుడు తెలుసుకుని, పశ్చాత్తాపపడితే మాత్రం ఏం లాభం?....నిజంగా అది పసిదే. ఆ రావుని ప్రేమించానని అనుకుంటుంది. అది ప్రేమ కాదని తెలుసుకోడానికి అట్టే కాలం పట్టదు దానికి. ఇద్దరూ కలిసి స్నేహంగా ఉండేవారు కాని, ఇలాంటిది ఉన్నట్టుగా నేను చూచాయగా కూడ కనిపెట్టలేకపోయాను. నిజానికి దానికి ఆ రావుతో ఉన్న స్నేహమే, ప్రేమగా అనిపిస్తోందంతే...." అంటుంది అమ్మ. "పోనీ కొన్నాళ్ళు ఆగి చూద్దాం. నేను స్విడ్జర్లాండ్ నుంచి ఒక ఆరు నెలలలోనే తిరిగి వచ్చేస్తాగదా!....అప్పటికీ తనకి అతనినే చేసుకోవాలని ఉంటే చేసుకోనీయ్.... లేదూ అంటే అప్పుడే చూద్దాం" అన్నాడు మావయ్య. నిజంగా నాకు మావయ్య మీద చాలా గౌరవం కలిగింది ఆ క్షణాన. మావయ్యకు కూడ మన సంగతి ఎలాగూ తెలుసు కనుక, ఇక నేను పనిగట్టుకు చెప్పవలసిందేమీ లేదని, తిరిగి నా గదిలోకి వచ్చేశాను. కాసేపటికి అమ్మ నా గదిలోకి వచ్చింది. "వనజా.....నీకు ఇంకా మేం చెప్పవలసిం దేమీ లేదు. నిన్నొదిలి పెట్టి మేం ఉండలేం. నిన్ను మావయ్యకే ఇస్తే, మావయ్య పరాయివాడు కాదు కనుక, వాడికీ నామీద అభిమానం ఎక్కువ కనుక, అందరం కలిసే ఉండొచ్చునని మా ఆశ. మావయ్యకు కూడ నీ మీద ఎంత అపేక్షో నీకు నిజంగా తెలియదు. నీ మీది ప్రేమతో నిన్ను చేసుకోవాలని ఉందికాని, నిజానికి తనకి ఎన్నో సంబంధాలొస్తున్నాయి. బోలెడంత సంపాదిస్తున్నాడు మైకా వ్యాపారంలో. తనకి తల్లిదండ్రిలేక, ఇక నేనే సర్వం అనుకుని నేనంటే ప్రాణం ఇస్తాడు.... తనకి నేను, నాకు తనూ అండ మా పుట్టింటివైపు నుంచి. నీకీ బాంధవ్యాలు, ఈ రక్తసంబంధమైన ప్రేమలు, ఆ మమతలు ఇప్పుడు తెలియవు. ఇవి తెంచుకుందామన్నా తెగవు. రేపు పెళ్ళయి ఒకింటిదానివైనప్పుడు పుట్టింటి బాంధవ్యం, అత్తింటి బాంధవ్యం తెలిసొస్తుంది. అందాక నేనెంత చెప్పినా నీకు తలకెక్కదు..... మావయ్య అంతతొందర పడడం లేదు. నువ్వూ ఆలోచించుకునే మరీ ఒక నిర్ణయానికిరా..... నాన్నగారు పైకి ఏమీ అనకపోయినా లోపల చాలా బాధపడుతున్నారు" అని నన్ను మాట్లాడనీయకుండా ఒక్కవరసన చెప్పేసి, అక్కడినుంచి వెళ్ళిపోయింది. నాకేటూ తోచడం లేదు. మీరు మీ అమ్మగార్ని ఒప్పించడం సంగతేమయింది! ఏ పరిస్థితుల్లోనూ పెండ్లికి తొందర పడకుండా ఆగవలసే వచ్చేటట్లుంది....ఏ సంగతీ వెంటనే వ్రాయండి.

వనజ."

అని ఉంది.

"ఈ ఉత్తరం చదివి ఏం సమాధానం వ్రాసి ఉంటారో ఆయన" అనుకుంది నీరజ. తొమ్మిదవ ఉత్తరం తీసింది. నెల రోజుల తరువాతి తేదీవేసి ఉంది.




పిచ్చాసుపత్రిలో
ఒకడు:— పాతడాక్టర్ కంటే మీరే మాకు బాగా నచ్చేరు.
డా:— "ఏం?" అన్నాడు ఉబ్బిపోతూ....
"మీరు మాలో ఒకరిలా ఉన్నారు."

"మీ అమ్మగార్కి ఇంకా తీవ్రంగా ఉందని వ్రాశారు. డాక్టరు కూడ, "ఆవిడకు మనోవ్యాధి ఎక్కువగా ఉంది. ఆవిడ కోరేదేదో తీర్చితేనేగాని ఆవిడ మరీ బాధ పడవలసి వస్తుంది" అన్నాడని వ్రాశారు. మీ అక్కగారు కూడ అదే అంటున్నారని వ్రాశారు. మరి నేనేం చేయనో చెప్పండి? మీకు మీ అమ్మగారు, మీ అక్కగారు ఎంత ముఖ్యమో, నాకూ మావాళ్లు అంతేగా. వారు నెమ్మది మీద నా ఇష్టానికి ఒప్పుకోనేటట్టుగా కనపడుతున్నప్పుడు, నేనెలా తొందరపడగలను? "ఇవాళో రేపో పోయే మా అమ్మ కోసమయినా మన పెళ్ళి త్వరగా అయిపోయేటట్టు చూడవూ" అని వ్రాశారు. నేనేం చేయను చెప్పండి. ఇవాళో, రేపో పోయే వాళ్ళ మనసు తీర్చడంకోసం. మనం తొందరపడితే కానిపరిస్థితులు ఏర్పడవచ్చు. ఆ తరువాత ఏమనుకొనీ ఏమి లాభం ఉండదు. నేనిలా వ్రాస్తున్నానని మీరు వేరే విధంగా అనుకోవద్దు. మీ అమ్మగారు చాలా కష్టాలు పడ్డమనిషనీ, ఆవిడ పోయేముందయినా శాంతిగా పోయేటట్లు చేయడం మీ ధర్మం అనీ వ్రాశారు. నిజమే.... కాని ఏం చేయగలం, పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు!

అమ్మ. నిన్న ఏదో మాటల మీద తన చిన్నప్పటి సంగతులు చెప్పుకొచ్చింది. తనూ, తన మేనమామ కొడుకూ పెళ్ళి చేసుకుందామనుకున్నారట. చివరికి అది కాలేదు. అమ్మకి మా నాన్నగారితో పెండ్లయి పోయిందట. పెండ్లి అయి పోయాక, తను ఇక ఆ ప్రేమ విషయం ఆలోచించే వీలులేకుండానే సంసారపు గొడవల్లో మునిగి పోయిందట. ఎప్పుడైనా వాళ్ళ బావ గుర్తుకొచ్చినా తన కాట్టె బాధగా ఉండదట. పెళ్లి కాక ముందు తను ఎంత బాధ పడవలసి వస్తుందో బావని మర్చిపోలేక అని అనుకుందట. తీరా పెళ్ళయ్యాక ఆ సమస్యే తల ఎత్తలేదట అసలు.... అమ్మ అలా తన ప్రేమ సంగతి చెప్పుకొస్తే చాలా తమాషాగా అనిపించింది నాకు. ..అమ్మ అనుభవంలోనే నిజం ఉందా?.... అయితే ఇంక ప్రేమా ఒట్టిదేనా? ఏమిటో అంతా అగమ్యగోచరంగా ఉంది. నాకేటూ తోచడం లేదు. ఇల్లాంటి పరిస్థితుల్లో నేనుంటే, మీరు త్వరగా పెళ్ళయి పోవాలని తొందర పడతారని నేనెప్పుడూ అనుకోలేదు. మీరు నా లాగా ఓపికగా ఉండలేక పోతే.... ఇక నేను వేరే చెప్పవలసిందేమీ లేదు.

ఇట్లు
వనజ."

అని ఉంది. నీరజ తరువాతి కాగితం తీసింది. అది వనజ వ్రాసిన ఉత్తరంకాదు. వనజ తండ్రి వ్రాసింది.

నాయనా రావు,

"నువ్వూ, వనజా మాయింట్లో స్నేహముగా తిరుగుతూ ఉంటే నాకెంతో ముచ్చటగా ఉండేది. వనజకు వయసుకు తగ్గ పెద్దరికం లేదు. అమ్మాయి ప్రేమకీ స్నేహానికీ గల తేడాని గుర్తించ లేనంత పసిది. ఒకదానికొకటనుకొని పొరపాటు పడుతోందేమోనని నా నమ్మకం. ఎందుకంటే, నిత్యం తనని చూస్తూ ఉన్నాను కనుక నాకలా అనిపించింది. ఈ విషయములో నువ్వు, వయసులోనూ, జ్ఞానంలోనూ అమ్మాయి కంటె పెద్ద వాడివి కనుక, ఒక నిర్ణయానికి వచ్చి పరిస్థితులను చక్కబరుస్తావని, అమ్మాయికి నిశ్చింత కలుగ చేస్తావనే ఆశతో, నీ ఎడ్రసు అమ్మాయి డైరీలో చూసి వ్రాస్తున్నాను నీకీ ఉత్తరం. నా భార్య పెదనాన్న కొడుకుకి వనజ నిచ్చి చేసి, ఇద్దర్నీ మాకళ్లెదురుగ పెట్టుకు చూసుకోవాలని మాకు కోరికగా ఉంది. అమ్మాయికి కూడ అతనంటే అయిష్టం లేదు..... కాని తను నిన్ను ప్రేమిస్తున్నానని అనుకుంటోంది.... అదొక్కటే అభ్యంతరం తనకి. అమ్మాయికి తెలిసీ తెలియని పాలపొంగు వయసు. ఇకఆట్టె నేను రాయవలసిందేమీ లేదు.... శుభాశీస్సులతో,

రంగారావు."

అని వ్రాసి ఉంది. ఆ ఉత్తరం చదవగానే, నీరజకు కళ్ళ నీళ్లు తిరిగాయి. అప్పటి తన భర్త పరిస్థితి ఊహించుకుంటే "పాపం ఎంత బాధపడి ఉంటారో ఆయన" అనుకుంది నీరజ. తరువాతి ఉత్తరం తీసింది నీరజ. అది వనజ రాసిన ఉత్తరమే. దాని మీద, తమ పెండ్లికు ముందు రోజు తేదీ వేసి ఉంది. నీరజ ఆతృతగా ఆ ఉత్తరం చదవటం మొదలు పెట్టింది.

"నేను భయపడినంతా అయింది.... ప్రేమ అంతా బూటకం.... మీలో స్వార్థం ఎక్కువ. మీకు రేపో మాపో పోయే మీ అమ్మే ఎక్కువ. మా అమ్మ మాటల్లో పూర్తి సత్యం ఉందని తెలిస్తోంది ఇప్పుడు నాకు. రక్త సంబంధమే చివరికి గెలుస్తుంది.... మీ అమ్మగారి కోసం అని చెప్పి పెండ్లికి తొందరపడ్డారు మీరు. "ఆ అమ్మాయి ఎవరో, ఎలా ఉంటుందో నేను చూడలేదు. అక్క చూసి వచ్చింది. పెళ్లి మరో పది రోజులకి. నేను నీ ప్రేమకు అనర్హుడ్ని. నన్ను మర్చిపోయి. మీ మావయ్యని పెళ్లి చేసుకో. నువ్వొకసారి ఉత్తరం వ్రాసినట్టుగా, మీ మావయ్యకు నువ్వంటే చాలా ప్రేమ అనుకొంటా. మనం ప్రేమించిన వాళ్ళని మనం చేసుకునేకంటే, మనల్ని ప్రేమించే వాళ్ళని మనం చేసుకుంటే సుఖశాంతు లెక్కువగా ఉంటాయనుకొంటాను" అని వ్రాశారు. ధన్యవాదాలు. ఈ పరమ సత్యాన్ని విప్పి చెప్పడానికి మీకు ఇంతకాలం ఎందుకు పట్టిందో అర్థంకావడంలేదు. నా ప్రేమకు అనర్హులు మీరని, మీకు ఇప్పుడే క్రొత్తగా తెలిసి వచ్చింది కాబోలు.... నిజమేలెండి! మరొకరి ప్రేమకు అర్హులు కాబోయే ముందైనా ఆ సంగతి తెలుసుకున్నారు. అంతవరకు సంతోషం. నన్ను మా

మావయ్యను చేసుకోమని సలహాఇచ్చారు. మీ సలహా ననుసరించి కాకపోయినా నేను త్వరలోనే మా మావయ్యను పెళ్లి చేసుకోబోతున్నానని తెలియ జేయడానికి సంతోషిస్తున్నాను. మా మావయ్యకు మన ప్రేమ సంగతి తెలుసు కనుక నాకు ఇబ్బందిలేదు. మరి పాపం మీకు చిక్కేనేమో! ఎప్పుడైనా పొరపాటున మన ప్రేమసంగతి తెలిసి, మీ కాబోయే భార్యారత్నం కోపగిస్తే!.... ఎక్కడైనా ఎప్పుడైనా నేను ఎదురుపడితే నన్ను పలకరిస్తారా, లేక మీ ఆవిడకి తెలిసి పోతుందని ముఖంచాటు చేసుకుంటారా?....''

అని ఉంది. కింద సంతకంలేదు. 'సరిగ్గా పెళ్లికి ఒక్కరోజు ముందే ప్రియురాలి దగ్గరనుంచి వచ్చిన అలాంటి ఉత్తరాన్ని చూసుకుని భర్త ఎంత బాధపడి ఉంటాడో' అనుకుంది నీరజ. ఆ ఉత్తరాన్ని బట్టి, "ఆయన, వనజకు వాళ్లనాన్నగారి దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం సంగతి అసలు వ్రాసేవుండరు" అనుకుంది నీరజ. భర్తమీద జాలి, గౌరవం హెచ్చాయి నీరజకు. "అంతకుపూర్వం అన్ని ఉత్తరాలలో తన మావయ్యా తనమీద ఉన్న ప్రేమసంగతి తనకు మావయ్యమీద ఉన్న జాలి సంగతి అంత విపులంగా వ్రాసిన వనజ, రావుదగ్గరనుంచి వచ్చిన ఆ ఉత్తరాన్ని చూసి, అంత ఈర్ష్యపడి పోయిందేనేనంటే.... వనజలో పసితనంతోపాటు, ఈర్ష్యపాలు కూడ ఎక్కువే ఉంది" అనుకుంది నీరజ.... భర్త, వనజకు వ్రాసిన, "మనం ప్రేమించిన వాళ్ల కంటె, మనల్ని ప్రేమించేవాళ్లని మనం చేసుకుంటే సుఖశాంతు లెక్కువగా ఉంటాయేమో'' అన్నవాక్యం మళ్ళీగుర్తుకు తెచ్చుకుంది నీరజ. వనజను ఊరడిస్తూ తనభర్త ఆవాక్యం రాసినప్పటికీ, దానిలో నిజంగా సత్యం ఉన్నట్టు కనపడింది నీరజకి. తన సంగతి ఆలోచించుకోవడం మొదలు పెట్టింది. నిజంగా భర్తమీద తనకు చాలా ప్రేమ ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఆలోచించుకుంటే భర్తకు వనజ మీద ప్రేమఉంది కనుక, తనకి ఆ అమ్మాయిమీద జాలి, ఒకవిధమైన అభిమానం పుట్టుకొస్తున్నాయేగాని, మరోవిధమైన భావన కలగడంలేదు. ముందు హాలులో గోడనున్న గడియారం ఠంగు, ఠంగున మూడు గంటలు కొట్టింది. నీరజ చేతిలో మిగిలిన ఆఖరికాగితం తీసింది. అది నిన్ననే తన భర్తకు చేరినట్టుగా ఉంది. మూడు రోజులక్రితం తేదీ వేసిఉంది దానిమీద.

"రావుగారికి,

మీకు గతసంగతులు తెలియజేసి, బాధపెడ్దామని ఈ ఉత్తరం వ్రాయడం లేదు. మీ దగ్గర నేను వ్రాశిన ఉత్తరాలు, నేను ఈ ఊరుకొచ్చేసేటప్పుడు మీకు ఇచ్చిన ఫోటో ఉండిఉంటాయి. వాటిని తిరిగి పంపేయండి. లేదా చింపేయండి. పొరపాటున అవి మీ ఆవిడ కళ్లబడితే, మీ సంసారంలో కల్లోలం రేగవచ్చు.... ఇక ఉంటాను."

అని ఉంది. కింద సంతకం లేదు. అది వనజ వ్రాసిందేనని, సంతకంలేకపోయినా దస్తూరీ చూడగానే గుర్తుపట్టింది నీరజ... "పోనీ వీటిని నేనే చింపేస్తే" అనుకుంది నీరజ. చూస్తూ, చూస్తూ వాటిని చించలేక పోయింది. వనజ ఫొటోని వనజ వ్రాసిన ఉత్తరాలని,తీసి ఒక పెద్ద కవరులో పెట్టి, వనజ ఎడ్రసు కోసం వెతికింది. వనజ తండ్రి వ్రాసిన ఉత్తరవు కవురుపైన, 'ఫ్రమ్' అనే ఎడ్రసుచూసి, వనజ కేర్ ఆఫ్, ఆ ఎడ్రసు వ్రాసి, 'ఫ్రమ్' అని తన భర్త ఎడ్రసువ్రాసి, 'రిజిస్టర్డ్ పోస్టు' చేసి రమ్మని పనిమనిషి చేతికిచ్చి పంపింది. వనజ తండ్రివ్రాసిన ఉత్తరాన్ని ఎప్పటిప్రకారం అదే కవరులో ఉంచి దానిని బీరువాలో మూడవ అరలో పెట్టేసి, దాని మీద కొత్తపేపరుకాగితం వేసి,బట్టలు సర్దేసింది.

సాయంత్రం ఆఫీసునుంచి రాగానే, రావు బట్టల బీరువా తెరిచాడు లుంగీ కోసమని. నీరజ కాఫీ కప్పు బల్లమీద పెట్టి, భర్త బీరువా తెరవడం చూసి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

పదినిమిషాలయాక "నీరజా" అన్న పిలుపు వినబడింది. భర్త పిలుపు విని సంతోషం, ఎందుకు పిలిచి ఉంటాడో అని ఊహించుకునే సరికి గాభరా రెండూ ఒక్కసారే కలిగాయి నీరజకి. అడుగులు తడబడుతూ ఉంటే భర్తగదిలోకి వచ్చింది. "బీరువా సర్దేటప్పుడు నువ్వా కవరు చూశావా" అని అడిగాడు, ఆ మధ్యాహ్నం నీరజ తీసి చదివిన కవరును చూపిస్తూ. "చూశా"నన్నట్టు తల ఊపింది నీరజ.

"ఇంకేమైనా కాగితాలు కనపడ్డాయా" అన్నాడు రావు.

"కనిపించాయి....వాటిని మీరు చింపుదామనుకున్నారా; పంపుదామనుకున్నారా'' అంది నీరజ తలవంచుకుని

రావు తెల్లబోయాడు మొదట...కాసేపటికి తేరుకున్నాడు. అలాగే తలవంచుకుని నిలబడి ఉన్న నీరజవంక చూస్తూ ఉండిపోయాడు. నీరజ. 'భర్త తనుచేసిన పనికి ఏమనుకుంటున్నాడో, అంతసేపు మౌనంగా ఉండి' అని తల ఎత్తి భయం భయంగా భర్త ముఖంలోకి చూసింది.

"పంపుదామనుకున్నాను''అన్నాడు నీరజ ముఖంలోకి దిగులుగా చూస్తూ.

"నేనూ ఆ పనేచేశాను'' అంది నీరజ, జాలిగా భర్తముఖంలోకి చూసి పెదిమిల మీదికి నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

మరుక్షణం ఒక చేత్తో తలుపు రెక్కలు దగ్గరగా వేస్తూ, మరో చేత్తో నీరజను గుండెలకు హత్తుకున్నాడు రావు. నీరజ తల రావు కన్నీటితో తడిసింది. రావు గుండె నీరజ కన్నీటితో కరిగింది. ఆనందంలో, ఏదో లోకాలకు ఎగసిపోయిన నీరజను, చెవి దగ్గరగా భర్త "నువ్వు దేవతవి'' అన్న మాటలు, ఆనందపు స్వర్గశిఖరానికి జేర్చాయి. ★